

## క్రికెట్ లీగ్ పోటీలు ప్రారంభం

జైపూర్, ఫిబ్రవరి 1: జైపూర్‌లోని ఎస్టీపీపీలో గురువారం ఎస్టీపీపీ డీజీఎం పంతుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ లీగ్ పోటీలు ఎస్టీపీపీ ఈడి బసివి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా బసివిరెడ్డి మాట్లాడుతూ టోర్నీలో 12 జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. విజయవంతంగా టోర్నీని నిర్వహిస్తున్న డీజీఎం పంతులను ఈడీ అభినందించారు. మొదటి రోజు ఎస్టీపీపీ మావెరిక్స్, పీఎంపీఎల్ క్రీజ్ హంటర్స్ జట్లు తలపడ్డాయి. పీఎంపీఎల్ క్రీజ్ హంటర్స్ జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో అధికారులు ప్రసాద్, శ్రీనివాసులు, రామాశాస్త్రి, సుబ్బారావు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## పేదల అభివృద్ధే లక్ష్యం

**- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క**



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

మంచిర్యాల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ఉమ్మడి ఆదిలాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనను పురస్కరించుకొని మంత్రి మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు నివాసంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాకు తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా లాంటి ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో వైద్యులు అందుబాటులో లేరని అన్నారు. ఉమ్మడి జిల్లాలో కనీసం మంచినీళ్లు కూడా లేని గ్రామాలు ఉండడం బాధాకరమన్నారు. జిల్లాలోని ఆదివాసీ గూడాల్లో ప్రజలు రక్తహీనతతో బాధపడుతున్నారని చెప్పారు. వందలాది గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు లేని కారణంగా పౌష్టికారం అందించలేదని విమర్శించారు. రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు తన తొలి బహిరంగ సభను ఇంద్రవెల్లిలో ఏర్పాటు చేశారని చెప్పారు. సీఎం అయ్యాక మళ్లీ అక్కడనే బహిరంగ సభ ఏర్పాటు చేయడం ఉమ్మడి ఆదిలాబాద్‌పై ఆయనకున్న అభిమానాన్ని చాటుతోందన్నారు. శుక్రవారం ఇంద్రవెల్లిలో నిర్వహించే సీఎం బహిరంగ సభకు అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడుతూ ఆదివాసీ ప్రజల జీవనశైలిపై అవగాహన ఉన్న మంత్రి సీతక్కను జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమించిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, ఏఐటీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్, సీనియర్ కౌన్సిలర్ రావుల ఉప్పలయ్య పాల్గొన్నారు.

## విద్యార్థులకు టీఎల్ఎం కిట్‌ల పంపిణీ

ఏసీసీ, ఫిబ్రవరి 1: జిల్లాలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న 41 మంది విద్యార్థులకు టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్‌ను గురువారం మంచిర్యాల పట్టణంలోని జిల్లా సైన్స్ కేంద్రంలో డీఈవో యాదయ్య, డీఆర్‌డీవో పీడీ శేషాద్రి, డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐఈపీఐడీ ప్రతినిధి లకన్‌బాబు, సెక్టోరల్ అధికారులు చౌదరి, సత్యనారాయణమూర్తి, సైన్స్ అధికారి మధుబాబు, భీంరావు, ఐఈఆర్‌పీలు పాల్గొన్నారు.

## రామగుండం సీపీగా తరుణ్‌జోషికి అదనపు బాధ్యతలు

ఏసీసీ, ఫిబ్రవరి 1: మల్టీ జోన్ 2, 1 ఐజీగా పనిచేస్తున్న తరుణ్ జోషి రామగుండం పోలీస్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ డీజీపీ రవిగుప్తా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం రామగుండం పోలీస్ కమిషనర్‌గా పనిచేస్తున్న రెమా రాజేశ్వరిని వుమెన్ సేఫ్టీ వింగ్ డీఐజీగా బదిలీ చేశారు. తక్షణమే రామగుండం సీపీగా తరుణ్‌జోషికి బాధ్యతలు అప్పగించి కొత్త పోస్టులో జాయిన్ కావాలని డీజీపీ ఆదేశించారు.

## సజావుగా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

ఏసీసీ, ఫిబ్రవరి 1: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్ పరీక్షలు మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా గురువారం సజావుగా జరిగాయి. ఉదయం జనరల్ విభాగంలో 435మంది విద్యార్థులకు గాను 416 మంది, ఒకేషనల్ విభాగంలో 613 మంది విద్యార్థులకు గాను 490 మంది , మొత్తం 1048 మంది విద్యార్థులకు 906 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 142 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 848 మంది విద్యార్థులకు గాను 806 మంది పరీక్షకు హాజరు కాగా 42 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 36 పరీక్ష కేంద్రాల్లో పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు డీఐఈవో శైలజ తెలిపారు.

## 23 రోజుల శిశువుకు శస్త్ర చికిత్స విజయవంతం




శిశువుతో ఏయిమ్స్ ఆసుపత్రి వైద్యులు

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 1: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఏయిమ్స్ ఆసుపత్రిలో 23 రోజుల శిశువుకు శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసినట్లు డాక్టర్ యెగ్గన శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ నెన్నెల మండలానికి చెందిన రవళి తన 23 రోజుల మగ శిశువు చేతికి ఇన్‌ఫెక్షన్ సోకడంతో ఆసుపత్రిలో చేరిందన్నారు. పేషెంట్‌కు సెప్టీసీమియా ఉండడంతో పీడియాట్రిక్స్ విభాగం డాక్టర్ సునీత, ఎమెర్జెన్సీ టీం సహకారంతో ఆపరేషన్‌ను విజయవంతం చేశామని తెలిపారు. ఐదేళ్లుగా పిల్లలకు సంబంధించి ఆర్థోపెడిక్ విభాగంలో ఎన్నో శస్త్ర చికిత్సలు విజయవంతం చేశామని తెలిపారు. తక్కువ ఖర్చుతో హైదరాబాద్‌కు దీటుగా వైద్య సేవలందిస్తున్నామని తెలిపారు.

## కాంగ్రెస్‌లో చేరిన పీఏసీఎస్ చైర్మన్

జన్నారం, ఫిబ్రవరి 1: నూతనంగా ఎన్నికైన పొనకల్ పీఏసీఎస్ చైర్మన్ అల్లం రవి, డైరెక్టర్లు గురువారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఆధ్వర్యంలో మంత్రి సీతక్క ఆధ్వర్యంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన వారికి మంత్రి సీతక్క కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జన్నారం మండల నాయకులు ముజఫర్‌అలీఖాన్, రాజశేఖర్, శంకరయ్య, సయ్యద్‌ఇసాక్, మాణిక్యం,వెంకట్రాజం, కరుణాకర్ ,నందునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీగా బరిలో ఉంటాను

నస్పూర్, ఫిబ్రవరి 1: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి తాను వచ్చే ఎంపీ ఎన్నికలో స్వతంత్ర్య అభ్యర్థిగా బరిలో ఉంటానని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ నతాని యేలు అన్నారు. నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో గురు వారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు చాలా మంది స్థానికేతరులే పోటీలో ఉన్నారని, తాను స్థానికుడనని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రాంతాల సమస్యలపై అవగాహన కలిగి ఉన్నన న్నారు. పెద్దపల్లి పార్లమెంట్‌లో అన్ని ప్రాంతాలను పర్యటిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో స్వామి, మోహన్‌దాసు, వెంకటేశ్, రాజయ్య పాల్గొన్నారు.

## దశాబ్దాల సమస్యకు పరిష్కారం

**- ఎమ్మెల్యే చొరవతో రోడ్డు పనులు ప్రారంభం**


నెన్నెల, ఫిబ్రవరి 1: అటవీ అనుమతులు లేవనే ఒకే ఒక్క కారణంతో ఆ రోడ్డుపై దశాబ్దాల కాలంగా అభివృద్ధి పనులు నిలిచి పోయాయి. నెన్నెల-బెల్లంపల్లి ప్రధాన రహదారిపై బొప్పారం నుంచి దుగ్నపల్లి ఒడ్డు వరకు డబుల్ రోడ్డు పనులను అటవీ అధికారులు అడ్డుకున్నారు. పాత సింగిల్ రోడ్డుపైన బీటీ వేయడంతో రోడ్డు ఎత్తు పెరిగింది. రోడ్డుకు రెండు వైపుల మట్టి పోసేందుకు అనుమతి ఇవ్వక పోవడంతో రెండు ఫీట్ల లోతు గుంతలు ఏర్పడ్డాయి. స్థానిక కాంగ్రెస్ నాయకులు సమస్యను బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో జిల్లా కలెక్టర్, జిల్లా ఫారెస్టు అధికారులతో మాట్లాడారు. సమస్య తీవ్రతను వివరించి అనుమతులు పొందారు. వెంటనే పనులు ప్రారంభించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, సర్పంచ్ తోట సుజాతశ్రీనివాస్ గురువారం పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో గొల్లపల్లి ఎంపీటీసీ బొమ్మెన హరీశ్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు మల్లేష్, ఉప సర్పంచ్ అంజన్న, నాయకులు బానేష్, గోవింద్‌సింగ్, మహేష్‌గౌడ్, చెన్నోజు శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ముంపు భూముల్లో రియల్ వెంచర్లు



వేంపల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన వెంచర్

- అనుమతులు లేకపోయినా ప్లాట్ల అమ్మకాలు
- ఎమ్మెల్యే భాగస్వామ్యం పేరుతో అంటగట్టే యత్నం
- రాజకీయ అండదండలతో పెట్రేగుతున్న స్థిరాస్తి వ్యాపారులు
- సైట్ వైపు కన్నెత్తి చూసేందుకు జంకుతున్న అధికారులు



వర్షాకాలంలో నీట మునిగిన వెంచర్ భూములు (ఫైల్)

మంచిర్యాల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లాలో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు బరితెగిస్తున్నారు. ఇళ్ల నిర్మాణానికి పని కిరాని, తరుచుగా ముంపు గురయ్యే భూముల్లో అక్రమంగా, ఎలాంటి లే అవుట్ అనుమతులు లేకుండా ప్లాట్ల వెంచర్లు ఏర్పాటు చేస్తూ ప్రజ లను నట్టేట ముంచుతున్నారు. తమకు రాజకీయ అండదండలు ఉన్నాయంటూ అధికారులను బెదిరిస్తూ తమ దారికి అడ్డు రాకుండా పనులు చక్కబెడుతూ కోట్లకు పడగలెత్తుతున్నారు.

### నిబంధనలకు విరుద్ధంగా..

నిబంధనల మేరకు వెంచర్ ఏర్పాటు చేయాలంటే ముందస్తుగా లే అవుట్ అనుమతులు పొందాలి. అందుకోసం మున్సిపాలిటీ లేదా గ్రామ పంచాయతీ పేరుతో వెంచరు విస్తీర్ణం మొత్తంలో 10 శాతం ప్రజల అవసరాల కోసం రిజిస్ట్రేషన్ చేయించాలి. అలా వదిలిన స్థలంలో ప్రజల కనీసప అవసరాలైన పార్కు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలి. ప్రజలకు మంచినీటి వసతి, డ్రైనేజీ వ్యవస్థ, నిబంధనల మేరకు రోడ్ల నిర్మాణం చేపట్టాలి. నిర్ణీత సమయంలోగా వసతులన్నీ కల్పించిన అ నంతరం తిరిగి పర్మినెంట్ లే అవుట్ అనుమతులు పొందాల్సి ఉంటుంది. అప్పుడే ప్లాట్లు విక్రయించేందుకు అవకాశం ఉంటుంది. కాగా హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్లు 32, 33 లో ఏర్పాటు చేస్తున్న వెంచర్‌లో ఈ నిబంధనలేవీ అమలు పరిచిన దాఖలాలు లేవు.

### ఎమ్మెల్యేకు భాగస్వామ్యం పేరుతో..

వేంపల్లి శివారులో భారీ వెంచర్లు ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావుకు భాగ స్వామ్యం ఉందని, ఏ సమస్య వచ్చినా తానే చూసుకుంటారని నమ్మబ లుకుతూ ప్లాట్లను విక్రయించే పనిలో నిమగ్నమయ్యారు. లే అవుట్ అనుమతులు లేవని ఆందోళన చెందవలసిన అవసరం లేదని,

### జంకుతున్న అధికారులు..

అక్రమ వెంచర్లపై కొరడా ఝుళిపించే టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, పంచాయతీ అధికారులు వేంపల్లి గ్రామ శివారులో ముంపు ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న వెంచర్లపై కన్నెత్తికూడా చూడడం లేదనే ఆరోపణలున్నాయి. ఎమ్మెల్యే భాగస్వామ్యం ఉందని వ్యాపారులు ప్రచారం చేసుకోవడంతో అధికారులు స్థలాల వైపు వెళ్లేందుకు కూడా జంకుతున్నట్లు సమాచారం. నిత్యం బిజీగా ఉండే జాతీయ రహదారిని ఆనుకొని ముంపు భూముల్లో, అక్రమ పద్ధతుల్లో వెంచర్లు ఏర్పాటు చేసినా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. అన్ని రకాల అనుమతులతో సామాన్యులు ఇళ్లు నిర్మించుకుంటే రకరకాల నిబంధనల పేరుతో ముప్పు తిప్పలు పెట్టే అధికారులు, ప్రజా ప్రతినిధులు అక్రమంగా ఏర్పాటు చేసిన బడా వెంచర్ల జోలికి వెళ్లక పోవడం విమర్శలకు దారి తీస్తోంది.

అధికారులకు భయపడాల్సిన పని అంతకంటే లేదని నమ్మబలుకుతూ నిలువు దోపిడీకి పాల్పడుతున్నారు. ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడొకరి సూచనల మేరకే తాము వెంచర్ ఏర్పాటు చేశామని, వెంచర్ల వైపు ఎవరూ కన్నెత్తి చూడకుండా అతను మేనేజ్ చేశాడని ప్రచారం చేస్తున్నారు.

భవిష్యత్‌లో ఏ సమస్యా రాదని ప్రచారం చేసుకుంటూ ఇళ్ల నిర్మాణానికి అసలే పనికిరాని భూములను చదరపు గజం ఒక్కంటికి రూ. 8 వేల చొప్పున విక్రయిస్తున్నారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావుకు ఇప్పటి వరకు నియోజకవర్గంలో ఎలాంటి వ్యాపారాలు లేకపోగా, ఆయన పేరును వాడుకుంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమ మార్గంలో కోట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారు.

### నోటీసులు జారీ చేశాం...

**వేంపల్లి గ్రామ కార్యదర్శి ప్రతిభ**

వేంపల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేస్తున్న ప్లాట్ల వెంచర్లకు ఎలాంటి లేఅవుట్ అనుమతులు మంజూరు చేయలేదు. అనుమతుల కోసం ఇంత వరకు ఎవరూ దరఖాస్తు సైతం చేసుకోలేదు. వెంచర్ ఏర్పాటు చేస్తున్న సమాచారం అందగానే భూములను పరిశీలిస్తాం. వర్షాకాలంలో భూములన్నీ పూర్తిగా నీట మునిగాయి. అనుమతులు వచ్చే అవకాశం కూడా లేదు. పనులు నిలిపివేయాలని వారం రోజుల క్రితం నోటీసులు జారీ చేశాం.

వేంపల్లి గ్రామ శివారులో సుమారు ఎనిమిది ఎకరాల్లో ఏర్పాటు చేసిన వెంచర్ల భూములు గత జూలైలో వచ్చిన భారీ వరదల్లో ముంపునకు గురయ్యాయి. సుమారు నాలుగు రోజుల పాటు పది అడుగుల లోతు నీరు నిలిచి ఉంది. దాని పక్కనే ముల్కల్ల వాగు ఉండడంతో ప్రవాహం పెరిగినప్పుడల్లా ముంపునకు గురవుతూనే ఉన్నాయి. ఆ

### ముంపు ప్రాంతంలో వెంచర్ ఏర్పాటు...

ప్రాంతాన్ని బఫర్‌జోన్‌గా కూడా జిల్లా ఉన్నతాధికారులు ప్రకటించారు. అందులో ఎలాంటి శాశ్వత కట్టడాలు నిర్మించరాదనే నిబంధనలు ఉన్నాయి. అయినా ఇవేమీ పట్టని రియల్ ఎస్టేట్ వ్యాపారులు రాజకీయ అండదండలు ఉన్నాయనే నెపంతో ఏకంగా బడా వెంచర్లు ఏర్పాటు చేశారు. సదరు వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి లే అవుట్ అనుమతులు లేని కారణంగా ఇంటి నిర్మాణ అనుమతులు కూడా వచ్చే అవకాశం లేకపోగా, బ్యాంకు లోన్ సౌకర్యం కూడా ఉండదు. ఈ విషయాలను మరుగున పెట్టి ప్లాట్లు విక్రయిస్తూ నిలువు దోపిడీకి గురి చేస్తున్నారు.

## ఓటమిని తట్టుకోలేక ప్రభుత్వంపై విమర్శలు

**- చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి**

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 1: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి కర్ర కాల్చి వాత పెట్టి ఓడించారని, దీన్ని తట్టుకోలేక అసహనంతో ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అన్నారు. మందమర్రి ప్రెస్‌క్లబ్ లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు మతి భ్రమించి మాట్లాడుతున్నారన్నారు. కల్వకుంట్ల కుటుంబం కోట్ల రూపాయల కుంభకోణాలకు పాల్పడి రాష్ట్రాన్ని దివాలా తీయించారని విమర్శించారు. హైదరాబాద్ చుట్టు పక్కల భూములను అప్పనంగా నచ్చిన వారికి కట్టబెట్టారని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల కుంభ కోణం జరిగిందని అందరికి తెలుసన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా, రాష్ట్ర ప్రగతే లక్ష్యంగా పనిచేస్తున్నారని వివరించారు. తమ ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు అవుతున్నందున గద్దర్ జయంతి రోజు మంచి నిర్ణయం తీసుకున్నారని, సినిమా కళాకారులకు ఇచ్చే అవార్డును గద్దర్ అవార్డుగా ప్రకటించిన గొప్ప సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఇంద్రవెల్లిలో అమరులకు నివాళులర్పించడంతో పాటు అమరుల స్ఫూర్తితో పార్లమెంట్ ఎన్నికల శంఖారావం పూరించడానికి సీఎం వస్తున్నారని తెలిపారు. సీఎం సభకు నియోజకవర్గం నుంచి 10 వేల మందికి పైగా తరలివస్తున్నారని, ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేశామని తెలి పారు. సమావేశంలో గుడ్ల రమేష్, సత్యనా రాయణరెడ్డి, సుదర్శన్, కొమురయ్య, తిరుమల్, ఇసాక్, జావేద్, పాషా, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని కేకే 5 బంగ్లాస్ ఏరియాలో గురువారం క్యాంపు కార్యాలయం కోసం సింగరేణి యాజమాన్యం కేటాయించనున్న క్వార్టర్‌ను ఎమ్మెల్యే వివేక్‌వెం కటస్వామి పరిశీలించారు. సింగరేణి అధికారులతో మాట్లాడారు. పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట పీఏ రమణరావు స్థానిక నాయకులు గుడ్ల రమేష్, ఒడ్నాల కొమురయ్య, మంద తిరుమల్‌రెడ్డి, మహంత్ అర్జున్‌కుమార్, జావేద్‌ఖాన్, సత్యనారాయణరెడ్డి ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

## గుడుంబా తయారీదారులకు బెల్లం విక్రయిస్తే చర్యలు

చెన్నూరు, ఫిబ్రవరి 1: మేడారం జాతరను పురస్కరించుకుని గుడుంబా తయారీదారులకు బెల్లం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నంద గోపాల్ హెచ్చరించారు. గురువారం చెన్నూరు ప్రొహిబిషనరీ ఎక్సైజ్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరైనా బెల్లంను ఇతరత్రా అవసరాల కోసం వచ్చి అడిగితే విక్ర యించకూడదని తెలిపారు. సమావేశంలో సీఐ హరి పాల్గొన్నారు.

## గాంధారి వనం అభివృద్ధికి కృషి చేస్తా

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 1 : మండలంలోని బొక్కల గుట్ట గాంధారి మైసమ్మ ఆలయం, గాంధారి వనం అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి తెలిపారు. మందమర్రికి చెందిన అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకులు బండి సదానందం యాదవ్ గురువారం గాంధారి ఆలయం వద్ద పోచమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సహపంక్తి భోజనాలకు ఎమ్మెల్యే వివేక్‌వెం కటస్వామి, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు హాజరయ్యారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ రాజిరెడ్డి, వైద్యుడు రమణ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

- 7 మేకలు సజీవ దహనం
- రూ. 3 లక్షల ఆస్తి నష్టం



అగ్ని ప్రమాదంతో కాలుతున్న ఇల్లు

కోటపల్లి, ఫిబ్రవరి 1: మండలంలోని జనగామ గ్రామంలో బుధవారం అర్ధరాత్రి ప్రమా దవశాత్తు అగ్ని ప్రమాదం చోటు చేసుకుని చెన్నూరి పోశం అనే వ్యక్తికి చెందిన ఇల్లు కాలిపోయింది. ఈ ప్రమాదంలో ఏడు మేకలు సజీవ దహనమయ్యాయి. బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నూరి పోశం కుటుంబీ కులు ఇంటి ఆవరణలో చలి మంటలు కాగేందుకు నెగడు పెట్టుకున్నారు. రాత్రి పది గంటల తర్వాత ఇంట్లోకి వెళ్లి కుటుంబీకులు నిద్రించారు. గాలులకు నిప్పు రవ్వలు చెలరేగి ప్రమాదవశాత్తూ ఇంటికి అంటు కున్నాయి. ఒక్కసారిగా మంటలు రావడంతో మెళకువ వచ్చిన కుటుంబ సభ్యులు కేకలు పెడుతూ బయటకు వచ్చారు. అప్పటికే ఇంటి చుట్టూ మంటలు అంటుకు న్నాయి. కుటుంబీకులు ప్రాణాలతో బయట పడగా ఇంట్లో కట్టేసి ఉన్న ఏడు మేకలు సజీవ దహనమయ్యాయి. ఇంట్లో ఉన్న 40 వేల రూపాయలు, అరతులం బంగారంతో పాటు ఇతర సామగ్రి, ధాన్యం కాలిపోయాయి. సుమారు 3 లక్షల రూపాయలు ఆస్తినష్టం సంభవించి నట్లు అధికారులు అంచనా వేశారు. ఘటన ప్రాంతాన్ని చెన్నూరు రూరల్ సీఐ సుధాకర్, ఎస్సై సురే ష్, రెవెన్యూ అధికారులు, గ్రామసర్పంచు లక్ష్మణ్‌గౌడ్, ఎంపీటీసీ మారిశెట్టి తిరుపతిలు గురువా రం సందర్శించారు. జరిగిన నష్టాన్ని అంచనా వేశారు. బాధిత కుటుం బానికి సర్పంచు లక్ష్మణ్ గౌడ్ తక్షణ సహాయంగా 6 వేల రూపాయలు అందజేశారు. మండల కో ఆప్షన్ సభ్యుడు గరీబ్‌ఖాన్, మాజీ ఎంపీపీ వెంకటస్వామి, కాంగ్రెస్ నాయకులు శేఖర్, సమ్మయ్య, రాజన్న తది తరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.



## సంక్షిప్తం..

- రామకృష్ణాపూర్: ఆర్‌కె 1ఏ గని పక్కన ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహించే సమ్మక్క జా తర ఏర్పాట్లను మందమర్రి ఏరియా జీఎం ఎ. మనోహర్ పరిశీలించారు.
- హాజీపూర్: నస్పూర్‌లోని సాధన పాఠశాల మైదానంలో బుధవారం నిర్వహించిన సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో మండలంలోని గుడిపేట గ్రామంలోని మౌంట్ కార్మెల్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి బహుమతులు సాధించడంతో గురువారం ప్రిన్సిపాల్ సిస్టర్ ఆల్ఫీ అభినందిచారు.
- చెన్నూరు: మండలంలోని కిష్టంపేట గ్రామ కమిటీని బీజేపీ మండల అధ్యక్షుడు మోర్ల శంకర్ ఆధ్వ ర్యంలో గురువారం ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శులుగా రాజశేఖర్, రాజేష్, కార్యదర్శిగా రాజబాపు, ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా రాజేష్, బీసీ మోర్చా అధ్యక్షుడిగా సాగర్‌ను ఎన్నుకు న్నారు.
- మంచిర్యాల కలెక్టరేట్: ఎమ్మెల్సీగా ఎన్నికైన తెలంగాణ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను గురువారం హైద్రాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్‌లో మంచిర్యాల జిల్లా స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు విజిగిరి రవి కలిసి అభినందించారు.
- శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని విశ్వశాంతి హైస్కూల్‌లో బాల, బాలికలకు అండర్-14 రగ్బీ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు.

- శ్రీరాంపూర్ ఏరియా అధికారుల సంఘం(సీఎంఓఏఐ) ప్రతినిధులు రాష్ట్ర మంత్రి సీతక్కను సీసీసీ గెస్ట్‌హౌస్‌లో గురువారం కలిసి సమస్యలు తెలిపి పరిష్కరించాలని కోరారు
- జన్నారం: జన్నారంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ రాహుల్ తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు.
- మందమర్రిటౌన్: దేశ వ్యాప్తంగా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 16న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెకు సింగరేణి కార్మికులు కదం తొక్కాలని సీఐటీయూ బ్రాంచీ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటస్వామి, అల్లి రాజేందర్‌లు తెలిపారు.
- ఏసీసీ: నెహ్రూ యువ కేంద్ర సంఘటన మంచిర్యాల జిల్లా అడ్వైజరీ బోర్డు సభ్యుడిగా మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన పల్లి రాకేష్‌ను నియమిస్తూ కేంద్ర యువజన, క్రీడల మంత్రి అనురాగ్‌సింగ్‌ఠాకూర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.
- బెల్లంపల్లి: రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా గురువారం పట్టణంలో హెల్మెట్ వినియోగంపై వాహనదారులకు బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య అవగాహన కల్పించారు.

- పట్టణంలోని కళావేదికలో గురువారం జాతీయ విపత్తు ప్రతిస్పందనదళం విజయవాడ పదో బెటాలియన్ ఆధ్వర్యంలో ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రక్షణ చర్యలపై అవగాహన కల్పించారు.
- దండేపల్లి: లింగాపూర్‌లో ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ఇంటర్ విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నింబధనలపై ఎంవీఐ రాహుల్ కుమార్ ఎస్సై ప్రసాద్‌తో కలిసి అవగాహన కల్పించారు.
- కాసిపేట: కుర్రెఘూడ్‌లో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు జరిగే పహాండి కూపర్ లింగు స్వామి జాతరను విజయవంతం చేయాలని నిర్వహణ కమిటీ గౌరవాధ్యక్షుడు ఆడె జంగు కోరారు.

- నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్సై గంగారాం అన్నారు. గురువారం కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్త కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

## ఘనంగా బొమ్మల కొలువు


ప్రారంభిస్తున్న సీఎండీ బలరాం సతీమణి

జైపూర్, ఫిబ్రవరి 1: జైపూర్‌లోని ఎస్టీపీపీలో గురువారం సింగరేణి లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో బొమ్మలు కొలువు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సింగరేణి సీఎండీ బలరాం సతీమణి శారద, లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు భవాని బసివిరెడ్డి ప్రారంభించారు. మహిళలకు రంగవల్లులు, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించారు.

# నవజాత శిశువు మృతి

**- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబీకుల ఆందోళన**



బాధిత కుటుంబీకులతో మాట్లాడుతున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో మృతి చెందిన శిశువు)

బెల్లంపల్లి, ఫిబ్రవరి 1: బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం నవజాత శిశువు మృతిచెందడంతో వైద్యుల నిర్లక్ష్యమే కారణమని పేర్కొంటూ కుటుంబీకులు ఆందోళన చేపట్టారు. బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట మండలం బొంబాయి గూడ గ్రామానికి చెందిన తాళ్లపల్లి రజిత పురిటి నొప్పులతో బాదపడుతుండగా గురువారం బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యుల పర్యవేక్షణలో ఉన్న ఆమె సాధారణ ప్రసవమై ఆడ శిశువుకు జన్మనిచ్చింది. పాప కొంత సమయం వేచి చూసినా ఏడవక పోవడంతో మంచిర్యాలకు తరలించాలని వైద్యులు సూచించారు. దీంతో 108 అంబులెన్స్‌లో మంచిర్యాలలోని ఆసుపత్రికి తీసుకువెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే శిశువు మృతిచెందిందని నిర్ధారించారు. వైద్యుల నిర్లక్ష్యంతో శిశువు మృతి చెందిందని బెల్లంపల్లి ఆసుపత్రి వైద్యుల తో కుటుంబ సభ్యులు వాగ్వాదానికి దిగారు. ఆపరేషన్ థియేటర్‌లో ఫోన్‌లో మాట్లాడుతూ కాలక్షేపం చేశారని, సరైన సమయంలో వైద్యం అందించక పోవడంతో శిశువు మృతిచెందిందని, దీన్ని కప్పిపుచ్చుకోవడానికి మృతిచెందిన శిశువును మంచిర్యా లకు తీసుకువెళ్లాలని సూచించారని ఆవేదన వ్యక్తం చేశారు. శిశువు మృతికి కారణమైన వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం పోలీసులకు తెలియడంతో అక్కడికి చేరుకుని ఆసుపత్రి వద్ద ఆందోళన చేయ వద్దని సూచించడంతో ఆందోళన విరమిం చారు. ఈ విషయంపై ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రవి వివరణ కోరగా శిశువు ఏడవక పోవడంతో మంచిర్యాల ఆసుప్రత్రికి తరలించాలని సూచించామని చెప్పారు. తాము వైద్యం విషయంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించలేదని తెలిపారు.

## గుర్తు తెలియని వృద్ధుడి మృతి

ఏసీసీ, ఫిబ్రవరి 1: మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి ముందు గుర్తు తెలియని వృద్ధుడు మృతిచెందినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. వృద్ధుడి వయస్సు సుమారు 70 ఏళ్ల ఉంటుందని, అనారోగ్యంతో మృతిచెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామని తెలిపారు.

## 950 గ్రాముల గంజాయి స్వాధీనం

బెల్లంపల్లి, ఫిబ్రవరి 1: బెల్లంపల్లిలోని హనుమాన్ విగ్రహం హైవేపై గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా 950 గ్రాముల గంజాయి పట్టుబడిందని వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు స్కూటీపై అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని తనిఖీ చేయగా స్కూటీ డిక్కీలో 950 గ్రాముల గంజాయి లభించిందన్నారు. పట్టణంలోని పో స్టాఫీసు బస్తీకి చెందిన పైడిమల్ల పృధ్వీరాజ్, టేకుల సబ్తీకి చెందిన రామ్‌శ్రీమిత్రలను అరెస్టు చేసినట్లు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కోటపల్లి, ఫిబ్రవరి 1: మండలంలోని ఎసన్‌వాయి గ్రామానికి చెందిన మారుపాలక బానయ్య (66) అనే వ్యక్తి చెన్నూరు నుంచి ఎసన్‌వాయికి వస్తుండగా గురువారం సాయంత్రం ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి కింద పడి మృతిచెందాడు. బానయ్య తన ద్విచక్రవాహనంపై తన సొంత పనుల నిమిత్తం చెన్నూరుకు వెళ్లాడు. ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో చెన్నూరు ప్రధాన రహదారిలో సర్వాయిపేట సమీపంలో బైక్ అదుపు తప్పి కింద పడడంతో గాయాలై అక్కడికక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై సురేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## భారత్‌కు 31 సాయుధ డ్రోన్లు

వాషింగ్టన్, ఫిబ్రవరి1: వాస్తవాధీన రేఖ వెంబడి చైనాకు చెక్ పెట్టేందుకు.. హిందూ మహాసముద్రంలో పట్టు పెంచుకునేందుకు ఇండియాకు ఎంతగానో ఉపయోగపడే ఎమ్‌క్యూ-9బి ప్రిడేటర్ డ్రోన్లను విక్రయించడానికి అమెరికా ప్రభుత్వం గురువారం ఆమోదం తెలిపింది. ఈ డీల్ కింద 3.99 బిలియన్ డాలర్ల (సుమారు రూ.33వేల కోట్లు) విలువైన 31 డ్రోన్లను అమెరికా సరఫరా చేయనుంది. ఎమ్‌క్యూ-9బి రిమోట్లీ పైలెటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్‌గా పిలిచే ఈ సాయుధ డ్రోన్ల కొనుగోలుపై గత జూన్‌లో ప్రధాని మోదీ అమెరికాలో పర్యటన సందర్భంగా ఇరు దేశాల మధ్య అంగీకారం కుదిరింది. ఇందుకు అవసరమైన అనుమతి మంజూరు చేస్తూ అమెరికా కాంగ్రెస్ సర్టిఫికెట్ ఇచ్చిందని డిఫెన్స్ సెక్యూరిటీ కో-ఆపరేషన్ ఏజెన్సీ తాజాగా తెలిపింది. అమెరికా-భారత్ మధ్య వ్యూహాత్మక సంబంధాల బలోపేతంలో భాగంగా ఈ మెగా డ్రోన్‌డీల్ జరిగిందని పేర్కొంది. భారత్ భద్రతను పెంచేందుకు, ఇండో-పసిఫిక్, దక్షిణాసియా ప్రాంతంలో సుస్థిర, శాంతి, ఆర్థిక ప్రగతిని పెంపొందించేందుకు ఇది ఉపకరిస్తుందని తెలిపింది. మానవరహిత నిఘా విషయంలో భారత్ సామర్థ్యాలు మరింత బలోపేతమవుతాయని అభిప్రాయపడింది. సైన్యం ఆధునికీకరణకు భారత్ కట్టుబడి ఉందని, అందువల్ల వీటిని అందజేయడంలో తమకు ఇబ్బందేమీ లేదని పేర్కొంది. వీటిని హై ఆల్టిట్యూడ్ లాంగ్ ఎండ్యూరెన్స్ (హెచ్ఏఎల్ఈ-హేల్)యూఏవీలుగా వ్యవహరిస్తారు. ఈ 31లో 15 డ్రోన్లను సీగార్డియన్ల పేరుతో నేవీకి ఇస్తారు. స్కై గార్డియన్ పేరుతో ఎయిర్‌ఫోర్స్‌కు 8డ్రోన్లు, ల్యాండ్ వర్షన్ పేరుతో ఆర్మీకి మిగతా 8కేటాయిస్తారు. ఖలిస్థాన్ ఉగ్రవాది గురుప్రీత్ సింగ్ పన్నున్ హత్యకు భారత్ కుట్రపన్నుతున్నందున డ్రోన్లఅమ్మకాల ఒప్పందాన్ని అమెరికా నిలిపివేస్తుందంటూ వార్తలువచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ ఆమోదం లభించింది.

## వీసా ఫీజులు భారీగా పెంచిన అమెరికా

వాషింగ్టన్, ఫిబ్రవరి1: అమెరికాకు వచ్చే విదేశీయుల నుంచి వసూలు చేసే నాన్-ఇమిగ్రెంట్ వీసా ఫీజులను బైడెన్ ప్రభుత్వం బుధవారం భారీగా పెంచింది. వీసా ఫీజులను పెంచడం 2016 తర్వాత ఇదే ప్రథమం. ఏప్రిల్1 నుంచి ఇవి అమల్లోకి వస్తాయి. భారతీయులకు అత్యంత ఉపయోగకరంగాఉండే హెచ్-1బీ, ఎల్-1, ఈబీ-5 వీసాల రుసుములు గణనీయంగా పెరిగాయి. విదేశాల వృత్తి నిపుణులు అమెరికాలో ఉద్యోగాలు చేయడానికి హెచ్-1బీ వీసాలు ఇస్తారు. ఇందుకు ఉద్దేశించిన ఫారం 1-129 ఫీజు 460డాలర్ల (రూ.38,150)నుంచి 780డాలర్ల (రూ.64,690)కు పెరిగింది. హెచ్-1బీ వీసాల రిజిస్ట్రేషన్ రుసుము 10 డాలర్ల నుంచి 215 డాలర్ల (రూ.17,830)కు పెంచారు. ఈ నిర్ణయం వచ్చే ఏడాది నుంచి అమల్లోకి వస్తుంది. బహుళజాతి కంపెనీ ఉద్యోగుల బదిలీకి ఉద్దేశించిన ఎల్-1 వీసాల రుసుములు 460డాలర్ల నుంచి 1,385 డాలర్ల (రూ.1,14,860)కు పెరిగాయి. అమెరికా పౌరులకు ఉద్యోగాలిచ్చే వారికి ఈబీ-5 వీసాలు మంజూరు చేస్తారు. వీటి రుసుములు 3,675డాలర్ల నుంచి 11,160 డాలర్ల (రూ.9,25,510)కు పెరిగాయి. మరికొన్ని రకాల వీసాల ఫీజులు స్వల్పంగా తగ్గాయి.

# కాంగ్రెస్ వలలో పడొద్దు

(మొదటి పేజీ తరువాయి)

చేయకండి. సీఎంను కలవాలనుకుంటే సమాచారం ఇచ్చి వెళ్లండి' అని సున్నితంగా హెచ్చరించినట్లు సమాచారం. "కాంగ్రెస్ ప్రభుత్వం చాలా సవాళ్లను ఎదుర్కోనాల్సి ఉంది. రాష్ట్ర ఆదాయం అంతంతమాత్రంగా ఉంది. కనీసం అంచనా వేయకుండానే ఇబ్బడిముబ్బడి హామీలిచ్చారు. అమలు చేయలేక ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం ఉంటుందా? ఉండదా? అనేది వారి చేతుల్లోనే ఉంది. ప్రతిపక్షంగా సమర్థంగా వ్యవహరిద్దాం. ఏడాది లోపే ప్రజలకు అసలు విషయం తెలుస్తుంది. మనం తొందరపడాల్సిన పనిలేదు. సంయమనం పాటిద్దాం. చక్కగా నిలబడితే చాలు.. వచ్చే ప్రభుత్వం మనదే"నని కేసీఆర్ పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలించామని.. ఓడిపోయినంత మాత్రాన నిరుత్సాహం, భయడాల్సిన అవసరం లేదన్నారు. కృష్ణా ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పగించే అంశంపై పార్లమెంటులో నిరసన తెలపాలని ఎంపీలకు సూచించారు. కేంద్ర జల శక్తి శాఖ మంత్రినీ కలవాలని నిర్దేశించారు. లోక్‌సభ ఎన్నికల్లో గట్టిగా పోరాడదామని.. అందరితో చర్చించి, మంచి అభ్యర్థులను ప్రకటిస్తామని తెలిపారు.

### అసాధ్యమని ఆర్బీఐనే చెప్పింది

రూ.36 వేల కోట్ల రైతు రుణమాఫీ అసాధ్యమని, ఏక మొత్తంలో ఇన్ని కోట్లు మాఫీ వీలుకాదని ఆర్బీఐ తెలిపిందని పార్టీ నేతల వద్ద కేసీఆర్ వ్యాఖ్యానించారు. అయినా.. ఏపీలో చెల్లించారు. తెలంగాణలోనూ రుణమాఫీ చేస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి రైతాంగాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. "మనం అధికారంలో ఉన్నప్పుడే కేంద్ర ప్రభుత్వం ఏమీ చేయలేదు. కాంగ్రెస్ ఉంటే చేస్తుందా? వాళ్లకూ చేయదు. శుక్రవారం తెలంగాణ భవన్‌కు వస్తా. బడ్జెట్ సమావేశాల్లో పాల్గొంటా" అని కేసీఆర్ తెలిపారు. కాగా, బడ్జెట్ సమావేశాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అనుసరించాల్సిన తీరుపై అంశాల వారీగా చర్చించారు. కేటీఆర్, పోచారం, హరీశ్‌రావు, తలసాని, ప్రశాంత్‌రెడ్డి, మల్లారెడ్డి, జగదీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేగా ప్రమాణం

గజ్వేల్ ఎమ్మెల్యేగా కేసీఆర్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. శాసనసభ స్పీకర్ గడ్డ ప్రసాద్ తన



చాంబర్‌లో మధ్యాహ్నం 12.45 గంటలకు ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పోచారం, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు పాల్గొన్నారు. అనంతరం అసెంబ్లీ ఆవరణలోని ప్రతిపక్ష నేత చాంబర్‌లో కేసీఆర్ ప్రత్యేక పూజలు చేసి బీఆర్ఎస్ శాసనసభాపక్ష నేతగా బాధ్యతలు చేపట్టారు. కాగా, ఈ కార్యక్రమాలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, చింతా ప్రభాకర్, కాలె యాదయ్య, పద్మారావుగౌడ్ హాజరు కాలేదని సమాచారం.

## రేవంత్ నేను పాత మిత్రులం!

### త్వరలోనే రేవంత్‌ను కలుస్తా: మల్లారెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): "నేను రేవంత్‌రెడ్డి పాత మిత్రులం. టీడీపీలో కలిసి పనిచేశాం. ఇప్పుడు ఆయన రాష్ట్ర సీఎం. ఆయనను కలిస్తే తప్పేంటి" అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. రేవంత్‌ను త్వరలోనే కలుస్తానని చెప్పారు. కీసర ఆలయంలో నిర్వహించబోయే పూజా కార్యక్రమాలకు ఆహ్వానిస్తానని తెలిపారు. గురువారం అసెంబ్లీ ప్రాంగణంలో మల్లారెడ్డి మీడియాతో మాట్లాడారు. మల్కాజిగిరి ఎంపీ స్థానంలో పోటీ చేయాలని బీఆర్ఎస్ అధిష్ఠానం తనను కోరుతోందని చెప్పారు. అయితే, తన కుమారునికి అవకాశం కల్పించాలని అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశానన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేయబోనని చెప్పారు. అయితే, "రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఆ పార్టీ వాళ్లకు షాక్.. అధికారం కోల్పోవడం మాకు షాక్" అని మల్లారెడ్డి వ్యాఖ్యానించారు. కాగా, హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం నెమ్మదించిందన్న మల్లారెడ్డి.. త్వరలో గోవాలో రియల్ వ్యాపారం చేస్తానని చెప్పారు. ఇప్పటికే గోవాలో ఓ హోటల్ కొన్నట్లు తెలిపారు.

## పాత.. కొత్త స్పీకర్ల కలయిక!



బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 1: ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డాక రాష్ట్రంలో అసెంబ్లీ స్పీకర్లుగా పనిచేసిన, చేస్తున్న ముగ్గురు ఒకచోట కలిశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తరపున అసెంబ్లీ స్పీకర్‌గా 2014-19 వరకు మధుసూదనా చారి, 2019-23 వరకు పోచారం శ్రీనివాస్‌రెడ్డి కొనసాగారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం తరపున 2023 డిసెంబరు నుంచి గడ్డం ప్రసాద్.. స్పీకర్‌గా కొనసాగుతున్నారు. గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం సందర్భంగా వారు ముగ్గురు కలిశారు. ఈ సందర్భంగా ముగ్గురూ కలిసి ఫొటో దిగారు.

## టచ్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. హైకమాండ్ వద్దనడంతో ఆగాం

» ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ

కామారెడ్డి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): "బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చాలా మంది కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పలువురు ఎమ్మెల్యేలు కలవడమే ఇందుకు నిదర్శనం. వారంతా కాంగ్రెస్‌లో చేరే అవకాశాలున్నాయి. అయితే.. హైకమాండ్ ఇప్పుడప్పుడే పార్టీ ఫిరాయింపులు వద్దని చెప్పింది. అందుకే.. ఫిరాయింపులను ప్రోత్సహించడంలేదు" అని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ వ్యాఖ్యానించారు. గురువారం ఆయన కామారెడ్డిలో జరిగిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని ప్రసంగించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెలవదన్నారు. కేటీఆర్ అహంకారపూరితంగా మాట్లాడుతున్నారంటూ షబ్బీర్ అలీ మండిపడ్డారు. "రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్‌ను ఛీ కొట్టినప్పటికీ కేటీఆర్ అహంకారం తగ్గడంలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కాకముందే సర్కారును కూల్చేస్తామని, త్వరలోనే ప్రభుత్వం పడిపోతుందంటూ కేటీఆర్ అహంకారపూరిత మాటలు మాట్లాడుతున్నారు. ప్రభుత్వాన్ని ఎలా కూలుస్తారో చూస్తాం" అని సవాల్ విసిరారు. పదేళ్లుగా రాష్ట్రాన్ని బీఆర్ఎస్ లూటీ చేసిందని ఆరోపించారు. ఓ అధికారి వద్దే రూ.100 కోట్ల అవినీతి సొమ్ము బయటపడడం బీఆర్ఎస్ పాలనకు నిదర్శనమని ఆయన విమర్శించారు.

## ఎంపీ టికెట్ ఆశావహులతో గాంధీభవన్‌లో సందడి

### కాంగ్రెస్ టికెట్ కోసం 41 మంది దరఖాస్తులు

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు దరఖాస్తులు సమర్పించడానికి వచ్చిన ఆశావహులు, వారి అనుచరులతో గాంధీభవన్‌లో గురువారం సందడి నెలకొంది. పార్టీ తరఫున తమకు టికెట్ కేటాయించాలని కోరుతూ 41 మంది అభ్యర్థులు దరఖాస్తులు ఇచ్చారు. బుధవారం ఏడుగురు దరఖాస్తు చేసుకోగా గురువారం 34 మంది పార్టీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తూ దరఖాస్తులను సమర్పించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సతీమణి ఖమ్మం పార్లమెంట్ స్థానానికి దరఖాస్తు చేశారు. అదే నియోజకవర్గం నుంచి తనకు అవకాశం కల్పించాలని పార్టీ సీనియర్ నేత వి.హన్మంతరావు దరఖాస్తు సమర్పించారు. భువనగిరి నుంచి చామల కిరణ్ కుమార్ రెడ్డి, నిజామాబాద్ నుంచి ఆకుల లలిత తదితరులు లోక్‌సభ బరిలో నిలిచేందుకు తమకు అవకాశం కల్పించాలని దరఖాస్తులు అందజేశారు. నియోజకవర్గాల వారిగా.. మహబూబాబాద్ 9, నాగర్‌కర్నూల్ 8, వరంగల్ 6, భువనగిరి 6, ఖమ్మం 2, నిజామాబాద్ 3 చొప్పున దరఖాస్తులు అందినట్టు గాంధీభవన్ వర్గాలు పేర్కొన్నాయి.



## బడ్జెట్‌లో అందమైన అబద్ధాలు చెప్పారు

» సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

హైదరాబాద్, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మధ్యంతర బడ్జెట్‌లో అందమైన భాషతో అందమైన అబద్ధాలు చెప్పారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ విమర్శించారు. బడ్జెట్‌లో ఉద్యోగాల ఊసే లేదని, కార్పొరేట్ రంగానికి పెద్దపీట వేశారన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి చూపారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ ఊసే లేదని, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు నిధులు ప్రకటించలేదన్నారు. విద్యా రంగానికి 10శాతం నిధులు కేటాయించాల్సి ఉన్నా విస్మరించారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ అన్నారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేసేలా బడ్జెట్ ఉందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ విమర్శించారు.

### ఇది భ్రమల బడ్జెట్: తమ్మినేని

కేంద్ర బడ్జెట్‌ను కార్పొరేట్లకు లాభాలు కట్టబెట్టే, ప్రజలను భ్రమల్లో పెట్టే బడ్జెట్ అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రకటించిన బడ్జెట్ ఇది అని పేర్కొన్నారు.

## జనాభా వృద్ధి రేటు సవాళ్లపై కమిటీ

» ఉన్నతాధికారులతో ఏర్పాటు చేయనున్న కేంద్రం

» సంతానోత్పత్తి రేటు తగ్గుతోందంటూ నివేదికలు

» తగినంతగా రీ ప్లేస్‌మెంట్ లేదనే ఆందోళనలు..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: దేశంలో జనాభా వృద్ధి రేటులో ఎదురవుతున్న సవాళ్లపై ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మల తెలిపారు. సంతానోత్పత్తి రేటు భర్తీ స్థాయుల (రీప్లేస్‌మెంట్ రేట్) కంటే పడిపోయినట్లు గణాంకాలు సూచిస్తుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దేశంలో 2011లో చివరిసారిగా జనాభా లెక్కల సేకరణ చేపట్టారు. 2021లో మళ్లీ గణన నిర్వహించాల్సి ఉన్నప్పటికీ కొవిడ్ నేపథ్యంలో వాయిదా వేశారు. ఈ క్రమంలో జనాభాపై సాధికార లెక్కలు లేవు. వృద్ధి రేటు 2.1 నుంచి 2కి తగ్గిందంటూ 2020 నాటి శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (ఎస్ఆర్ఎస్), 2.2 నుంచి 2కు పడిపోయిందంటూ నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్) పేర్కొన్నాయి. దీనికి పరిష్కార మార్గాలను కమిటీ సూచించనుంది. జనాభా వేగవంతమైన వృద్ధి, మార్పుల నుంచి ఉత్పన్నమయ్యే సవాళ్లను పరిశీలించనుంది.

# గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు యాభై ఏళ్లు

» భాగ్యనగరం నుంచి వాల్తేరుకు మొదటి రైలు ఇదే

» 1974 ఫిబ్రవరి 1న ప్రారంభమైన ఎక్స్‌ప్రెస్



సికింద్రాబాద్/హైదరాబాద్ సిటీ, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గోదావరి ఎక్స్‌ప్రెస్.. ఏపీలోని ఉభయ గోదావరి జిల్లాలతోపాటు ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన రైలు ప్రయాణికులకు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన రైలు. గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో బెర్త్ దొరికిందంటే.. బంగారం బిస్కెట్ దొరికినంతగా విశాఖ ప్రాంతవాసులు ఆనందపడతారంటే అతిశయోక్తికాదు. 1974 ఫిబ్రవరి 1న హైదరాబాద్-విశాఖపట్నం మధ్య ప్రారంభమైన మొట్టమొదటి రైలు ఇది. అంటే ఈ రైలు ప్రవేశపెట్టి గురువారానికి సరిగ్గా యాభై ఏళ్లు పూర్తయ్యాయి. గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు ప్రస్తుతం హైదరాబాద్(నాంపల్లి) స్టేషన్ నుంచి సాయంత్రం 5.05గంటలకు బయల్దేరి సికింద్రాబాద్, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, అనకాపల్లి మీదుగా.. విశాఖపట్నానికి చేరుకుంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉద్ధండులైన ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు ఇది ఎంతో ముఖ్యమైన రైలుగా ఉండేది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు రావాలన్నా, ఇక్కడ్నుంచి స్వస్థలాలకు వెళ్లాలన్నా ఈ రైలులో వెళ్లడాన్ని సౌకర్యవంతంగా భావిస్తారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత ప్రజాప్రతినిధులు, అధికారుల తాకిడి కొంత తగ్గినా.. సాధారణ ప్రయాణికుల నుంచి ఆదరణ ఏమాత్రం తగ్గలేదు. దక్షిణ మధ్యరైల్వే ఆధ్వర్యంలో నడుస్తున్న గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు మొత్తం 18స్టేషన్లలో ఆగుతుంది. 24 బోగీలతో అతిపొడవైన రైలుగా పేరుగాంచిన ఈ ఎక్స్‌ప్రెస్ 710 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. గురువారం సాయంత్రం గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు రైల్ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధులు నాంపల్లి స్టేషన్‌లో ఘనంగా పుట్టిన రోజు వేడుకలు నిర్వహించడం విశేషం. దక్షిణ మధ్య రైల్వే కూడా ఈ ఎక్స్‌ప్రెస్‌ను సర్వాంగ సుందరంగా అలంకరించింది. ఈ రైలు ఆగే అన్ని స్టేషన్లలో వేడుకలు జరిపారు. 1990లోనే 24 కోచ్‌లతో అతి పెద్ద రైలుగా పేరొందిన గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో 2000 సంవత్సరం నుంచి ఫస్ట్‌క్లాస్ ఏసీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. 1993 నుంచే థర్డ్ ఏసీ కోచ్‌లున్న ఈ రైలు.. దక్షిణ మధ్య రైల్వేలోనే మొదటి ఏసీ కోచ్ ఉన్న ఎక్స్‌ప్రెస్‌గా పేరుగాంచింది. ఈ ఎక్స్‌ప్రెస్‌ను నేరుగా దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ పర్యవేక్షిస్తారంటే దానికి ఉన్న ప్రాముఖ్యత చెప్పనక్కర్లేదు. రైలు నిర్వహణ నుంచి సమయపాలన, పరిశుభ్రత, ఆహార నాణ్యత, ఫిర్యాదులు, ఇతర ఆపరేషన్స్ అన్నీ ప్రతిరోజూ జీఎం టేబుల్ మీద ఉండాల్సిందేనని చెబుతుంటారు.

# 74 టీఎంసీలు కేటాయించాలి!

### గోదావరి-కావేరి అనుసంధానంపై కేంద్రాన్ని డిమాండ్ చేసిన తెలంగాణ

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గోదావరి-కావేరి అనుసంధానంలో తరలించే 148 టీఎంసీల జలాల్లో 74 టీఎంసీలను తమకు కేటాయించాలని తెలంగాణ కోరింది. నదుల అనుసంధానంలో తెలంగాణకు 45 టీఎంసీలు కేటాయించాలని ప్రతిపాదించారని, అవి సరిపోవని తెలిపింది. పూర్వ నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పలు ప్రాంతాలకు సాగునీటిని అందించాల్సి ఉన్నందున, 74 టీఎంసీలు ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. గోదావరి-కావేరి అనుసంధానంపైతెలంగాణ లేవనెత్తిన అంశాలపై చర్చించడానికి వీలుగా గురువారం జలసౌధలో జాతీయ నీటి అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) హైదరాబాద్ విభాగం చీఫ్ ఇంజనీర్ దేవేందర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. దీనికి తెలంగాణ నుంచి ఈఎన్‌సీ బి.నాగేంద్రరావు, అంతరాష్ట్ర విభాగం చీఫ్ ఇంజనీర్ మోహన్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. గోదావరి-కావేరి అనుసంధానంతో వివిధ అంశాలపై రాష్ట్ర అధికారులు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. కాగా తెలంగాణ అభ్యంతరాలపై మళ్లీ సమావేశం ఉంటుందని ఎన్‌డబ్ల్యూడీఏ స్పష్టం చేసింది. అనుమానాలన్నీ నివృత్తి చేశాకే నదుల అనుసంధానంలో ముందుకెళతామని తెలిపింది.

## నేటి నుంచి పంచాయతీల్లో 'ప్రత్యేక' పాలన

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ సర్పంచుల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో శుక్రవారం నుంచి పంచాయతీలకు ప్రత్యేక అధికారులు బాధ్యత వహించనున్నారు. ఈ మేరకు గ్రామ ప్రత్యేకాధికారుల నియామకం, బాధ్యతల స్వీకరణ, విధి విధానాలను సూచిస్తూ.. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీఓ, తహశీల్దారు, ఎంపీఓ, డీటీ, ఆర్ఐ, ఇంజినీర్లు, ఎంఈవోలు, ఇతర గెజిటెడ్ స్థాయి అధికారులను గ్రామ ప్రత్యేక అధికారులుగా నియమించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా లేకపోవడంతో పదేళ్ల తర్వాత మళ్లీ గ్రామాల్లో ప్రత్యేక పాలన ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించడంతో గురువారం సర్పంచుల వద్ద ఉన్న డిజిటల్ కీలు, చెక్కులు, ఇతర రికార్డులన్నీ సీజ్ చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు.

## నేడు ఈజీఎస్ ఉద్యోగులకు పే స్కేల్ ప్రకటన..?

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): 'గత ప్రభుత్వం పే స్కేల్ ప్రకటిస్తామని హామీ ఇచ్చింది.. అది అమలుకు నోచుకోలేదు.. కొత్త ప్రభుత్వం మా ఆశలు నెరవేరుస్తుందని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తమకు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి నేడు(శుక్రవారం) ఇంద్రవెల్లి సభలో తమ పే స్కేల్ ప్రకటిస్తారని, సంబురాలు జరుపుకొనేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకున్నామని ఈజీఎస్ ఉద్యోగులు ఒక ప్రకటనలో తెలిపారు.

## కోర్టు ఆదేశాలిచ్చిన గంటల్లోనే జ్ఞానవాపీ సెల్లార్‌లో పూజలు

» హైకోర్టులో అప్పీలు చేసిన మసీదు కమిటీ

వారాణసి, ఫిబ్రవరి 1: జ్ఞాన్‌వాపీ మసీదు సెల్లార్‌లోని 'వ్యాస్ కీ టెఖానా'లో ఉన్న హిందూ దేవత విగ్రహాలకు పూజలు చేసుకోవచ్చంటూ జిల్లా కోర్టు ఆదేశాలు ఇచ్చిన కొద్ది గంటల్లోనే అక్కడ ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. బుధవారం రాత్రి 10.30 గంటల సమయంలో పూజలు చేసి లక్ష్మీదేవి, వినాయకులకు హారతి ఇచ్చారు. 31 సంవత్సరాల అనంతరం వ్యాస్‌జీ కా టెఖానాను పూజల కోసం తెరిచారని కాశీ విశ్వనాథ మందిర ట్రస్టు అధ్యక్షుడు నాగేంద్ర పాండే తెలిపారు. కాగా, తమకు అప్పీలు వంటి న్యాయ ప్రక్రియకు కూడా అవకాశం ఇవ్వకుండా హిందువులు పూజలు చేసుకోవడానికి అనుమతి ఇవ్వడం తగదని పేర్కొంటూ మసీదు కమిటీ గురువారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే తొలుత హైకోర్టులో పిటిషన్ వేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ చెప్పడంతో దాన్ని అమలు చేసింది. అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ సమర్పించి అత్యవసరంగా విచారణ జరపాలని కోరింది.

# హేమంత్ సోరెన్‌కు ఒక రోజు కస్టడీ

» 10 రోజుల పాటు ఇవ్వాలన్న ఈడీ వినతిపై నేడు తీర్పు

» రాంచీలో 8.5 ఎకరాలు ఆక్రమించినట్టు కేసు నమోదు

రాంచీ, ఫిబ్రవరి 1: మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను గురువారం ఇక్కడి పీఎంఎల్ఏ ప్రత్యేక కోర్టు ఒక రోజు జ్యుడీషియల్ కస్టడీకి పంపించింది. పోలీసులు ఆయనను ఇక్కడి బీర్సా ముండా సెంట్రల్ జైలుకు తరలించారు. ఆయనను పది రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలన్న వినతిపై కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించనుంది. ఈడీ బుధవారం ఆయనను ఏడు గంటల పాటు విచారించింది. అనంతరం ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయగా రాత్రి పది గంటల సమయంలో గవర్నర్ హౌస్ వద్ద అరెస్టు చేసింది. కాగా, రాత్రి సమయంలో గవర్నర్ హౌస్ ఆవరణలోనే అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ గురువారం సోరేన్ లాయర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ సమయంలో ఆయన ధరించిన మతమపరమైన లాకెట్, రింగ్‌లను తీసివేయాలని ఈడీ అధికారులు కోరగా అందుకు ఆయన నిరాకరించారు. రాంచీలో సోరేన్ 12 చోట్ల 8.5 ఎకరాల విస్తీర్ణంగల స్థలాలను అక్రమంగా కలిగి ఉన్నారంటూ ఈడీ కేసుపెట్టింది. ఈ వ్యవహారంలో నగదు అక్రమ నగదు చలామణి జరిగినట్టు ఆరోపించింది. తొలుత భూమి రికార్డుల నకిలీ పత్రాలను తయారు చేస్తున్నారంటూ రెవెన్యూ శాఖ సబ్ ఇన్‌స్పెక్టర్ భాను ప్రతాప్ ప్రసాద్‌పై కేసు నమోదయింది. ఆయన వద్ద 11 ట్రంకు పెట్టెల్లో ఒరిజినల్, నకిలీ దస్తావేజులు, 17 ఒరిజినల్ రిజిస్టర్లు లభించాయి. దీనిపై జరిగిన విచారణలో ఇందులో సోరేన్‌కు సంబంధం ఉందంటూ ప్రసాద్ ఫోన్‌లో లభించిన సమాచారం ఆధారంగా ఈడీ కేసు నమోదు చేసింది. వాంగ్మూలం నమోదు చేయడానికని పిలిచి ఎలా అరెస్టు చేస్తారని సోరేన్ తరఫున హాజరైన అడ్వకేట్ జనరల్ రాజీవ్ రంజన్ ప్రశ్నించారు. ఇది ప్రభుత్వాన్ని కూలగొట్టడానికి జరిగిన కుట్ర అని ఆరోపించారు.



జేఎంఎం కూటమి ఎమ్మెల్యేలను తరలించడానికి బేగంపేట విమానాశ్రయం వద్ద సిద్ధంగా ఉన్న బస్సులు

## ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

చంపయి సోరెన్ గవర్నర్ రాధాకృష్ణన్‌ను కలిశారు. హేమంత్ సోరెన్ రాజీనామా చేసిన అనంతరం రాష్ట్రానికి కొత్త సీఎం లేకపోవడంతో గందరగోళ పరిస్థితులు నెలకొని ఉన్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి లేకపోవడంతో రాజకీయ సంక్షోభం ముదిరిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్న తమ విజ్ఞప్తిని అంగీకరించాలని కోరారు. కాగా, చంపయి సోరెన్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించడంలో గవర్నర్ ఆలస్యం చేయడంతో.. జేఎంఎం-కాంగ్రెస్ కూటమి ఎమ్మెల్యేలను హైదరాబాద్ తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. గురువారం రెండు చార్టర్డ్ విమానాలను సిద్ధం చేయగా.. సాయంత్రం 6.30 గంటల సమయంలో పొగమంచు ఎక్కువగా ఉండడంతో వాటిని రద్దు చేశారు. 81 మంది సభ్యులున్న ఝార్ఖండ్ అసెంబ్లీలో జేఎంఎం కూటమికి 43 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇక మనీలాండరింగ్ కేసులో ఈడీ తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ మాజీ సీఎం హేమంత్ సోరెన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆయన పిటిషన్‌ను విచారించేందుకు సీజేఐ ముగ్గురు న్యాయమూర్తులతో ప్రత్యేక ధర్మాసనాన్ని ఏర్పాటు చేశారు. సోరెన్ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరపనున్నారు.



# పట్టు తప్పుతున్న పాలన



ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

- కొత్త మండలాల్లో నేటికీ తీరని సమస్యలు
- ఇప్పటికీ పూర్తిస్థాయిలో లేని అధికారులు, భవనాలు
- పాత మండలాల అధికారులే ఇన్‌చార్జీలు
- జిల్లాలో 3 కొత్త మండలాలు
- ఏళ్లు గడుస్తున్నా.. గాడినపడని పాలన

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 1: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పరిపాలనా సౌలభ్యం కోసం 2016 అక్టోబరులో కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాతో పాటు చింతలమానేపల్లి, పెంచికలపేట, లింగాపూర్ మండలాలను ఏర్పాటు చేశారు. దానికనుగుణంగా పూర్తిస్థాయిలో వసతులు కల్పించక పోవడంతో స్థానికులు నిత్యం సమస్యలతోనే సహవాసం చేయాల్సి వస్తున్నది. ఏళ్లు గడుస్తున్నా కొత్త మండలాల్లో పలు కార్యాలయాల భవనాలకు పునాదులు పడకపోవడంతో అరకొర వసతులతోనే పాలన నెట్టుకొస్తున్నారు. దీంతో పాలన పట్టుతప్పుతుందనే వాదన బలంగా విన్పిస్తున్నది. కొంతమంది అధికారులు సైతం ఇలా వచ్చి అలా వెళ్లిపోతున్నారన్న విమర్శలు కూడా లేకపోలేదు. కొన్ని శాఖలకు అద్దె భవనాలు కూడా లేకపోవడంతో ఇప్పటికీ పాత మండలాల నుంచే పాలన కొనసాగుతోంది. అధికారులకు ప్రజలు ఏదైనా సమస్య చెప్పుకోవాలన్నా.. రోజుల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

**జిల్లాలో మూడు కొత్త మండలాలు..**

కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాతోపాటు చింతలమానేపల్లి, పెంచికలపేట, లింగాపూర్ మండలాలను ఏర్పాటు చేశారు. అయితే మూడ మండలాల్లో వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయని చెప్పవచ్చు. చింతలమానేపల్లి, లింగాపూర్ మండలాల్లో ప్రభుత్వ పాఠశాల భవనాలు, పెంచికలపేట మండలంలో ప్రభుత్వ పాఠశాల భవనంతో పాటు ఓ కులసంఘ భవనాన్ని అద్దెకు తీసుకొని తహసీల్దార్ కార్యాలయం కొనసాగిస్తున్నారు.

ప్రధానంగా వ్యవసాయం, విద్య, తదితర శాఖలకు భవనాలు లేవు. అయితే కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వం అయినా కొత్త మండలాల్లో పూర్తిస్థాయిలో భవనాల నిర్మాణం, అధికారుల నియామకం చేపట్టాలన్న డిమాండ్ మండల ప్రజల్లో ఉంది. విద్య, వ్యవసాయం, గ్రామీణ అభివృద్ధి వంటి శాఖల అధికారుల సైతం ఇప్పటికీ ఇన్‌చార్జీలే ఉండడంతో పాలన గాడిన పడడం లేదు.

**ఇన్‌చార్జీలతో ఇబ్బందులు..**

కొత్త మండలాలను ఏర్పాటు చేసినా దానికనుగుణంగా అధికారుల నియామకం చేపట్టకపోవడంతో ఒక్కో అధికారికి రెండు, మూడు మండ లాల బాధ్యతలు, శాఖలు అప్పజెప్పుతున్నారు. మండలం కొత్తదైనా పాత మండలాల అధికారులే ఇన్‌చార్జీలుగా ఉండడం, కనీస సౌకర్యాలు లేవన్న కారణంతో అధికారులు సైతం ఇక్కడకు వచ్చేందుకు అంతగా ఆసక్తి కనబర్చడం లేదు. పూర్తిస్థాయిలో పాలన సక్రమంగా అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మండలప్రజలు కోరుతున్నారు.

**కొత్త మండలాల్లో సమస్యలు పరిష్కరించాలి..**



**తిరుపతి, చింతలమానేపల్లి**

గతంలో ప్రభుత్వంపాలన సౌలభ్యం కోసం కొత్త మండలాలు ఏర్పాటు చేశారు. కానీ పూర్తి సౌకర్యాలు ఏర్పాటు కల్పించడంలో విఫలమైంది. ప్రస్తుతం ఏర్పడిన కొత్త ప్రభుత్వమైనా స్పందించి కొత్త మండలాల్లో పూర్తిసౌకర్యాల కల్పనకు కృషి చేయాలి. పూర్తిస్థాయి భవనాలతో పాటు అధికారుల నియామకం చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి.



పాఠశాల భవనంలో కొనసాగుతున్న ఎంపీడీవో కార్యాలయం

## నేటి నుంచి మున్సిపాలిటీగా ఆసిఫాబాద్

- జీవో విడుదల చేసిన ప్రభుత్వం

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 1: ఆసిఫాబాద్ మేజర్ గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ గురువారం ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర మున్సిపాలిటీ విభాగం డైరెక్టర్ డి దివ్య ఉత్తర్వులను విడుదల చేశారు. జనకాపూర్, గొడవెల్లితో కలుపుకొని మొత్తం 20వార్డులతో ఆసిఫాబాద్ మున్సిపాలిటీని ఏర్పాటు చేసింది. శుక్రవారంనుంచి ఆసిఫాబాద్‌మున్సిపాలిటీగా కొనసాగనున్నది. ఆసిఫాబాద్ మున్సిపల్‌కమిషనర్‌గా కాగజ్‌నగర్ మున్సిపాలిటీకమిషనర్‌కు ఇంచార్జ్ బాధ్యతలను అప్పగించారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీకి కమిషనర్ నియమించేంతవరకు ఆయన పూర్తి అదనపు బాధ్యతలను నిర్వహిస్తారని జీవోలోపేర్కొన్నారు. దీంతోఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఆసిఫాబాద్ పట్టణవాసుల కల సాకారం అయింది.

## నేటి నుంచి ప్రత్యేకాధికారుల పాలన

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 1: గ్రామపంచాయతీల పాలకవర్గం పాలన గురువారంతో ముగిసింది. ఈనేపథ్యంలో గ్రామపంచాయతీలకు శుక్రవారంనుంచి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగనున్నది. గ్రామ పంచాయితీల ఎన్నికలు చేపట్టేవరకు పంచాయితీల నిర్వహణ బాధ్యతను ప్రత్యేకాధికారులు చేపట్ట నున్నారు. జిల్లాలో 15మండలాలలో 335గ్రామ పంచాయితీలు ఉండగా ఆసిఫాబాద్ మేజర్‌గ్రామపంచాయతీకి ఎన్నికలు జరుగకపోగా అప్పటినుంచి ప్రత్యేకాధికారి పాలనలోనే కొనసాగుతూ వస్తున్నది. తాజాగా 334గ్రామ పంచాయితీలకు ప్రత్యేకాధికారులను నియమించేందుకు జిల్లా అధికార యంత్రాంగం కసరత్తుచేసింది. ఇందుకోసం జిల్లాఅధికారులు గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారుల నియామక జాబితాను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, నీటిపారుదలశాఖ, వ్యవసాయశాఖ, విద్యాశాఖ, పశుసంవర్ధకశాఖ, వైద్య ఆరోగ్యశాఖలలో వివిధ కేటగిరీలలో పనిచేస్తున్న అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించనున్నారు.

## జిల్లాలో 30పోలీసుయాక్టు అమలు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 1: జిల్లావ్యాప్తంగా 30పోలీసుయాక్టు అమలులో ఉందని ఎస్పీ సురేష్‌కుమార్ తెలిపారు. పోలీసుఅధికారుల అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు నిర్వహించరాదన్నారు. నిషేధిత ఆయుధాలైన కత్తులు,చాకులు,కర్రలు,జెండాకర్రలు,దుడ్డుకర్రలు, పేలుడుపదార్థాలువాడరాదన్నారు.

## 'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 1: గురుకులాల్లో పది, ఇంటర్‌లో వందశాతం ఫలితాలు సాధించేలా పక్కా ప్రణాళికతో కృషి చేయాలని గురుకులం అడ్మిన్ స్పెషల్‌ఆఫీసర్ ఏకాంబరం అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పీటీజీ గురుకులం, గిరిజన బాలికల, గిరిజన డిగ్రీ బాలికలకళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు, అధ్యాపకులు, ఉపాధ్యాయ, సిబ్బందితో వేర్వేరుగాసమావేశం నిర్వహించి పలుసూచనలు చేశారు. ఈవిద్యాసంవత్సరం పదవతరగతి, ఇంటర్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని దానికి అనుగుణంగా సూచనలు పాటించి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేష్, శారద, అనిత, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలి

బెజ్జూరు, ఫిబ్రవరి 1: విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలని స్కూల్‌కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు సునీత అన్నారు. గురువారం మండలంలోని ఎల్కపల్లి, చిన్న సిద్దాపూర్ ప్రాథమిక పాఠశాలను తనిఖీచేశారు. ఈసందర్భంగా రికార్డులను తనిఖీచేసి మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా హాజరయ్యేలా చూడాల న్నారు.

## బావిలోపడి ఒకరి మృతి



నరేష్(ఫైల్)

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 1: కౌటాల మండలం శిర్షా గ్రామానికిచెందిన దేవా నరేష్(19) గురువారం మండలంలోని కర్జవెల్లి గ్రామ సమీపంలోని వ్యవసాయబావిలోపడి మృతిచెందాడు. మృతుడి బంధువులు తెలిపినవివరాల ప్రకారం.. నరేష్ శిర్షా గ్రామంనుంచి పంటచేనులలో గొర్లను మేపేందుకు వచ్చాడు. ఈక్రమంలో సమీపంలో గల వ్యవసాయబావివద్ద మంచినీటి కోసం దిగుతున్న క్రమంలో కాలుజారిపడి మృతిచెందినట్లు తెలిపారు. కాగా నరేష్ ఒక్కడే కుమారుడు కావడంతో తల్లిదండ్రులు గట్టయ్య, బీరక్క కన్నీరుమున్నీరయ్యారు. విషయాన్ని పోలీసులకు తెలియజేయగా ఎస్సై సురేష్ సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్ అప్పగింత

వాంకిడి, ఫిబ్రవరి 1: వాంకిడి పోలీసుస్టేషన్ పరిధిలో ఎనగొంది గ్రామానికి చెందిన ఆత్రం తుకారాం నెలరోజుల క్రితం ఫోన్ పోగొట్టుకుని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఎస్సై సాగర్ సీఈఐఆర్ ద్వారా ఫోన్‌ను పట్టుకుని గురువారం బాధితుడికి అందజేశారు.

## సాగునీటి రంగానికి పెద్దపీట

- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు



చెక్ డ్యాం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

బెజ్జూరు, ఫిబ్రవరి 1: సిర్పూర్ నియోజకవర్గంలో సాగునీటి రంగానికి పెద్దపీట వేసి వ్యవసాయరంగాన్ని అభివృద్ధి పరిచేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు. గురువారం మండలంలోని కుశ్న పల్లి, కుకుడ గ్రామంలో చెక్‌డ్యాంల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెక్‌డ్యాంల నిర్మాణంతో రైతుల పంట పొలాలకు నీటితో పాటు భూగర్భజలాలు పెంపునకు దోహదపడుతాయన్నారు. సాగునీటిరంగాన్ని అభివృద్ధిచేసే దిశగా కట్టుబడి ఉన్నానని, ఇందులో భాగంగానే జగన్నాథ్‌పూర్, పీపీరావు ప్రాజెక్టులకు పూర్తి మరమ్మతులు చేపట్టి ఆయకట్టురైతులకు సాగునీరు అందేలాచర్యలు తీసుకుంటామన్నారు. అలాగే మత్తడి స్ప్రింగ్ ఆనకట్టకు మరమ్మతులు చేపట్టి పూర్తి స్థాయిలో కాలువల నిర్మాణం చేపట్టి రైతులకు రెండు పంటలు పండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే వేల ఎకరాలకు సాగునీరు అంది రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. అటవీఅనుమతులు లేక ఆగిపోయినరోడ్ల నిర్మాణానికి శ్రద్ధవహిస్తానని అన్నారు. చిన్న సిద్దాపూర్, ఎల్కపల్లి గ్రామాల్లో వ్యవసాయ భూములకు పట్టాలు ఇప్పించేందుకు కృషిచేస్తానన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద నిరుపేదలకు ఇల్లు కట్టిస్తానని అన్నారు. అనంతరం బీజేపీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో చేతిపంపు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఎల్కపల్లి గ్రామంలో క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌రావు, శంకర్, మనోహర్‌గౌడ్, శ్రావణ్, వసీఖాన్, సంతోష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

**భూములను కబ్జా చేస్తున్నారు..**

కాగజ్‌నగర్, జనవరి 29: కాగజ్‌నగర్ సర్‌సిల్క్ ఏరియాలో కొంత మంది భూములను ఆక్రమిస్తున్నారని వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని గురువారం సర్‌సిల్క్ ఎఫ్ కాలనీ వాసులు ఎమ్మెల్యే హరీష్‌బాబుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ తమకాలనీలో కొంత మంది సర్‌సిల్క్ భూములను యదేచ్ఛగా కబ్జా చేస్తున్నారన్నారు. ఈస్థలాలకు అధికారులు కరెంటు సౌకర్యాన్ని కూడా ఇచ్చారని అన్నారు. అలాగే తాగునీటి సౌకర్యం కూడా కల్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టులో కేసు ఉండగా కూడా అక్రమంగా ఇంటినెంబర్లు పొందుతున్నారని తెలిపారు. వెంటనే అధికారులతో విచారణ జరపాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే ఈ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## పార్టీని గ్రామగ్రామాన విస్తరింపజేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్





మాట్లాడుతున్న డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్

ఆసిఫాబాద్ రూరల్, ఫిబ్రవరి 1: జిల్లాలో గ్రామగ్రామాన బీజేపీని విస్తరింపజేయాలని జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండలాధ్య క్షుడు శ్రీధర్ అధ్యక్షతన గావ్‌చలో అభియాన్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గావ్‌చలో అభియాన్ వర్క్‌షాప్‌ని ప్రతిమండలంలో విజయవంతం చేయాలన్నారు. గ్రామగ్రామాన బీజేపీ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రజలను పార్టీకి చేరువయ్యేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లానాయకులు కాంద్రె విశాల్, సొల్లు లక్ష్మి, శ్రీధర్, తిరుపతి, శ్రీనివాస్, గణేష్ పాల్గొన్నారు.

## కార్మికుల సేవలు మరవలేనివి



గ్రామపంచాయతీ సిబ్బందిని సన్మానిస్తున్నసర్పంచ్, తదితరులు

వాంకిడి, ఫిబ్రవరి 1: వాంకిడి గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికుల సేవలు మరువలేనివని సర్పంచ్ తుకారాం అన్నారు. గురువారం వాంకిడి గ్రామపంచాయతీ కార్మికులను ఉపసర్పంచ్ పవన్ సాయితో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయిదు సంవత్సరాల పదవీ కాలంలో కార్మికులు తనకు సహాయ సహకారాలు అందించి గ్రామఅభివృద్ధికి సహకరించారన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి శివకుమార్, బిల్‌కలెక్టర్ గోవింద్, సిబ్బంది పాల్గొన్నారు.

## సమ్మక్క- సారలమ్మ జాతర కమిటీ

తిర్యాణి, ఫిబ్రవరి 1: తిర్యాణి మండలం అరటిపల్లి స్టేజీ వద్ద నిర్వహించే సమ్మక్క-సారలమ్మ జాతర నిర్వహణ కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీనివాస్, ఉపాధ్య క్షులుగా తిరుపతి, జంగు, మహేష్, పోచమల్లు, ప్రధాన కార్యదర్శిగా రారాజు, తిరుపతి, సభ్యులను ఎన్నుకున్నారు.

## సీఎం సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్

కాగజ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 1: ఇంద్రవెల్లిలో శుక్రవారం జరిగే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానికంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో పీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికల సభలో ఉమ్మడిజిల్లాకు వచ్చిన రేవంత్‌రెడ్డి ఇంద్రవెల్లి సభలో మాట్లాడినట్లు పేర్కొన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం ప్రస్తుతం తిరిగి ముఖ్యమంత్రి హోదాలో జిల్లాకు రానున్నట్లు తెలిపారు. బహిరంగ సభకు నియోజకర్గంలోని నాయకులు, మండల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తరలిరావాలని ఆయన కోరారు. సమావేశంలో వార్ల తిరుపతి, ఎమ్మాజీ సంతోష్ పాల్గొన్నారు.

**జైనూర్:** ముఖ్యమంత్రి బహిరంగ సభను విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావ్ కోరారు. మండల కేంద్రంలో గురువారం పార్టీ నాయకులతో కలిసి మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా కార్యాకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు. అంతకుముందు సభకోసం ఇక్కడికివచ్చిన భూపాలపెల్లి ఎమ్మెల్యే సత్యనారాయణ రెడ్డిని డీసీసీ అధ్యక్షుడు, ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జీ అజ్మీరా శ్యాంనాయక్, కుడ్మెత విశ్వనాథ్ తదితరులు ఘనంగా సన్మానించారు.

**ఆసిఫాబాద్ రూరల్:** సీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలని నియోజకవర్గ పరిశీలకుడు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. నియోజకవర్గంలోని పదిమండలాల నుంచి పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. సమావేశంలో జిల్లాఅధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, అజ్మీరా శ్యాంనాయక్, అశోక్, సంపత్‌రావు, గోపి పాల్గొన్నారు.

**బెజ్జూరు:** సీఎం రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకులు శ్రీవర్ధన్ అన్నారు. కార్యక్రమంలో శంకర్, హకీం, రాజారాం, బాబాజీ, నందారాం తదితరులు పాల్గొన్నారు.

## బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషిచేయాలి: ఎస్పీ

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 1: జిల్లాలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఎస్పీ సురేష్‌కుమార్ అన్నారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసినసమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో నెలరోజుల పాటు నిర్వహించిన ఆపరేషన్ స్మైల్-10లో 68మంది బాలకార్మికులను పట్టుకున్నామన్నారు. ఇందులో 63మంది బాలురు, ఐదుగురు బాలికలు ఉన్నట్లు తెలిపారు. ఆసిఫాబాద్ డివిజన్‌లో 28, కాగజ్‌నగర్‌డివిజన్‌లో 40మందిఉన్నట్లుతెలిపారు. బాలకార్మికుల యజమానులకు, బాలకార్మికుల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. జిల్లాలో 18 సంవత్సరాలలోపు పిల్లలు బాలకార్మికులుగా పనిచేస్తున్నా వ్యవసాయ పనుల్లో ఉన్నా, పశువులకాపర్లుగా ఉంచినానేరమన్నారు. పిల్లలబంగారు భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని బడికి పంపించాలన్నారు. ఆపరేషన్ స్మైల్-10 బృందంలో పని చేసిన పోలీసు, అధికారులు, సిబ్బందిని వివిధ డిపార్టుమెంట్ అధికారులను ఎస్పీ అభినందించారు.





## సమ్మెను విజయవంతం చేయండి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 1: దేశవ్యాప్తంగా ఈనెల16న జరిగే సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొనాలని కాంట్రాక్టు కార్మికసంఘాల సమాఖ్య జేఏసీ(ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ) నాయకులు పేర్కొన్నారు. ఈమేరకు వారు గురువారం జీఎం బి సంజీవరెడ్డికి సమ్మెనోటీసు అందించారు. కేంద్రప్రభుత్వం 44కార్మికచట్టాలను నాలుగుకోడ్లుగా విభజించాలని చూస్తున్నారని, పనిగంటలను 8 గంటల నుంచి 12గంటలకు పెంచాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాలను నాశనం చేసే ప్రయత్నాలను విరమించుకోవాలని కోరుతూ సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. వెంటనే యాజమాన్యాలు స్పందించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రీజియన్‌కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, శ్రీరాంపూర్ అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్, ఉపాధ్యక్షుడు కాతంరాజు ప్రభాకర్, సీఐటీయూ శ్రీరాంపూర్ కార్యదర్శి గట్టు మహేందర్, ఐఎఫ్‌టీయూ నాయకులు మేకల రాములు, కార్యదర్శి యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## 106 శాతంతో శ్రీరాంపూర్ ముందంజ

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 1: శ్రీరాంపూర్ ఏరియా 106శాతం బొగ్గు ఉత్పత్తితో ముందంజలో ఉందని జీఎం సంజీవరెడ్డి అన్నారు. కాన్ఫరెన్స్‌హాలులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అండర్‌గ్రౌండ్ గనుల్లో 90శాతం, ఉపరితల గనుల్లో 111శాతం బొగ్గుఉత్పత్తి సాధించినట్లు చెప్పారు. కార్మికులసంక్షేమం కోసం కోట్లరూపాయలు ఖర్చు చేస్తున్నామన్నారు. రూ.16కోట్లతో గోదావరిజలాలను కార్మికకుటుంబాలకు అందించనున్నట్లు తెలిపారు. మార్చి వరకు పనులు పూర్తవుతాయన్నారు. 70మిలియన్ టన్నులబొగ్గు ఉత్పత్తిని సాధిస్తామని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, క్వాలిటీ మేనేజర్ కె వెంకటేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన రక్షణ పరికరాలు అందించాలి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 1: కార్మికులకు నాణ్యమైన రక్షణపరికరాలు అందించాలని సీఐటీయూ అధ్యక్షకార్యదర్శులు గుల్లబాలాజీ, గోదారిభాగ్యరాజ్ ఒకప్రకటనలో కోరారు. చలికాలం ముగుస్తున్నా స్వెటర్లు ఇవ్వకపోవడం సరికాదన్నారు. బైక్‌పై వచ్చే కార్మికులు హెల్మెట్ పెట్టుకోవాలని సూచించే అధికారులుబూట్లు,సాక్షులు ఇవ్వకపోవడం వారినిర్లక్ష్యాన్ని సూచిస్తోందన్నారు. అన్నియూనియన్లతో కలిసి రక్షణసమావేశాలు నిర్వహించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

## బొగ్గు ఉత్పత్తికి అంతా కృషిచేయాలి

రెబ్బెన, ఫిబ్రవరి 1: బొగ్గు ఉత్పత్తికి అంతా కృషిచేయాలని జీఎం రవిప్రసాద్ అన్నారు. గురువారం మల్టీ డిపార్టుమెంటు కమిటీ అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన వివిధ అంశాలు, కార్యాచరణపై ఉద్యోగుల అభిప్రాయాలను అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం నరేందర్, ప్రాజెక్టు అధికారులు ఎన్ సత్యనారాయణ, ఉమాకాంత్, తిర్మల్‌రావు, ఆర్ శౌరి, ఉజ్వల్‌కుమార్ బెహర, రామారావు, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి పాల్గొన్నారు.

**జీఎంను కలిసిన కోల్‌మైన్ ఆఫీసర్స్‌సభ్యులు**

బెల్లంపల్లి జీఎం రవిప్రసాద్‌ను గురువారం కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం పలు సమస్యలను వివరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు డి మధుసూదన్, కార్యదర్శి వీరన్న, ఉపాధ్యక్షులు ఎం.రమేష్, ఉజ్వల్‌కుమార్ బెహరా, సంయుక్త కార్యదర్శులు బి నరేష్, ఎండి దావూద్ అహ్మద్‌తదితరులున్నారు.

## విజేతలకు ధ్రువీకరణ పత్రాలు అందజేత

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 1: ఇటీవలనిర్వహించిన అధికారులసంఘం(సీఎంఓఏఐ) ఎన్నికల్లో గెలుపొందిన వారికి జీఎం బి సంజీవరెడ్డి గురువారం ధ్రువీకరణ పత్రాలు అందించారు. అనంతరం ఆయనమాట్లాడుతూ, అధికారుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తామన్నారు. ధ్రువీకరణపత్రాలు పొందిన వారిలో అధ్యక్షుడు కె వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు మహేష్, కిరణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులు గౌస్‌పాషా, భీమన్న, కోశాధికారి రాము, సంయుక్త కోశాధికారి కోటేశ్వర్‌రావు ఉన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం రఘుకుమార్, ఏరియాఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఓసీపీలపీవోలు శ్రీనివాస్, పురుషోత్తమరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**అధికారుల సంఘం బాధ్యతగా పనిచేయాలి**

**మందమర్రిటౌన్:** మందమర్రిఏరియా అధికారుల సంఘంబాధ్యతగా పనిచేయాలని జీఎం మనోహర్ అన్నారు. ఇటీవల సీఎంవోఏఐ ఎన్నికలు జరగగా గెలుపొందిన అధికారులకు గురువారం జీఎం కార్యాలయంలో నియామకపత్రం అందించారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, గెలిచిన అధికారులు అందర్ని కలుపుకుని హక్కులకోసం కృషిచేయాలన్నారు.జీఎంను అధికారుల సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రమేష్, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఫైడీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎంపీఎఫ్ ఆన్‌లైన్ సర్వీస్ ప్రారంభం

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 1: సీఎంపీఎఫ్ ఆన్‌లైన్ సర్వీస్ (సీ-కేర్స్)ను కేంద్రబొగ్గుగనుల శాఖామంత్రి ప్రహ్లాద్ జోషి ఢిల్లీలో ప్రారంభించారు. కార్మికుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చేందుకు ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి. వాటన్నింటిని ఆన్‌లైన్‌లో పొందుపర్చి సేవలు అందించే పనిలో భాగంగా పోర్టల్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ పోర్టల్ ద్వారా పారదర్శకంగా, క్లెయిమ్‌ల పరిష్కారం, మెరుగైన రికార్డుల నిర్వహణ కొనసాగుతుందని చెప్పారు. భవిష్యత్తులో సభ్యులకు క్షణాల్లో సేవలు అందేలా చూస్తామని మంత్రి పేర్కొన్నారు.

## కార్మికుల హామీలను అమలుచేయిస్తాం

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 1: సింగరేణి కార్మిక గుర్తింపుసంఘం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేయిస్తామని గుర్తింపు సంఘం బ్రాంచి సహాయ కార్యదర్శులు కందిశ్రీనివాస్, సోంశెట్టిరాజేశం, పిట్‌కార్యదర్శి గాండ్లసంపత్ తెలిపారు. గురువారం ఏఐటీయూసీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కార్మికుల హక్కుల కోసం తాము ఎలాంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉన్నామన్నారు. కార్మికులు తమ సమస్యలు తెలియజేస్తే వాటిని పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. కార్మికులకు అండగాఉంటూ సంస్థఅభివృద్ధికి కూడా చేయూతనందిస్తామన్నారు.

## సంక్షిప్త సమాచారం..

**ఆసిఫాబాద్ రూరల్:**గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులపదవీకాలం ముగిసిపోవడంతో గురువారం ఈదులవాడ గ్రామపంచాయతీ సర్పంచ్‌భీమేష్, వార్డుసభ్యులను ఎంపీపీమల్లికార్జున్ సన్మానించారు.

**సిర్పూర్(యు):** ఎంపీడీవోకార్యాలయంలో గురువారం మండలంలోని గ్రామపంచాయతీల సర్పంచులకు జడ్పీటీసీ కోవ అరుణ, ఎంపీపీ తోడసం భాగ్యలక్ష్మి ఘనంగా సన్మానించారు.

-ఉపాధ్యాయులు విధుల పట్ల నిర్లక్షంగా వ్యవహరిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఎంఈవో కుడ్మెత సుధాకర్‌అన్నారు. గురువారంఆయన మండలకేంద్రంలోనిఆదర్శపాఠశాలలోసిర్పూర్(యు),లింగాపూర్ మండలాల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు.

**రెబ్బెన:** మండలంలోని వివిధ గ్రామపంచాయతీల సర్పంచ్‌లను గురువారం ఎంపీపీ సౌందర్య, జడ్పీటీసీ సంతోష్ సన్మానించారు.

-రెబ్బెన గోలేటిలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు గురువారం ఎస్సై చంద్రశేఖర్ దుప్పట్లను పంపిణీ చేశారు.

**కెరమెరి:** మండలంలోని జోడేఘాట్‌లోప్రధాన మంత్రిజన్‌మన్‌పథకంలో భాగంగానూతనంగా మంజూరైన ట్రైబల్‌వెల్ఫేర్ బాలికలఆశ్రమోన్నత పాఠశాల భవన కోసం గురువారం తహసీల్దార్ మువనర్‌షరీఫ్ స్థలపరిశీలన చేశారు.

**కాగజ్‌నగర్ టౌన్:** కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో భారతీయ యువశక్తి ట్రస్టు, సిర్పూర్ పేపర్‌మిల్లు ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు.

**ఆసిఫాబాద్:** జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లాఇంటర్మీడియట్ అధికారి నైతంశంకర్ పేర్కొన్నారు. గురువారం ప్రాక్టికల్ పరీక్షలను ప్రభుత్వకళాశాలలో పరిశీలించారు.

**కాగజ్‌నగర్:** రెండ్రోజుల క్రితం కౌటాల మండలంలో రోడ్డుపనుల శంకుస్థాపన సందర్భంగా బీఎస్పీకి చెందిన ఎంపీటీసీ మోతీరాంను పిలువకుండా అవమానించారని, ఈ విషయంలో ప్రోటోకాల్ పాటించని అధికారులపై చర్యలుచేపట్టాలని బీఎస్పీరాష్ట్రకార్యదర్శి సిడాంగణపతి డిమాండు చేశారు.

**చింతలమానేపల్లి:** మండలంలోని బాబాసాగర్ గ్రామంలో సయ్యద్‌సాబీర్‌హుస్సేన్ స్మారకార్థం నిర్వహించిన కబడ్డీ, వాలీబాల్‌పోటీలు గురువారంతో ముగిశాయి. విజేతలకు ఎంపీపీనానయ్య బహుమతులు ప్రదానం చేశారు.

**వాంకిడి:** పోలీసులుమీకోసంలో భాగంగా మండల కేంద్రం సమీపంలోని మూలమలుపుల వద్ద ఎస్సై సాగర్ ఆధ్వర్యంలో ముళ్లపొదళ్లను తొలగించారు. అలాగే ఎస్సీ బాలుర వసతిగృహం, ఆర్లి గ్రామానికి వెళ్లేరోడ్డు మూలమలుపు వద్ద ముళ్లపొదళ్లను తొలగించారు.